
సాక్షి
బాపట్ల
మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



విఘ్నేశ్వరునికి పూజలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు సోమవారం పూజలు చేశారు.




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.

అరటిపండ్లతో విశేష పూజలు


సత్తెనపల్లి: సత్తెనపల్లి నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అరటిపండ్లతో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

రేపటి నుంచి బగళాముఖి అమ్మవారి కొలుపులు

3న పురాతన బంగారు నగల అలంకరణ



చందోలు(కర్లపాలెం): చందోలులో శ్రీ బగళాముఖి అమ్మవారి వార్షిక కొలుపులు(తిరునాళ్ల) ఈనెల 30వ తేదీ నుంచి మే 5 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మేనేజర్ నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.3న అమ్మవారి పురాతన బంగారు ఆభరణాలను బ్యాంకు నుంచి తెచ్చి అలంకరిస్తామని పేర్కొన్నారు. అమ్మవారి జయంతి సందర్భంగా 5న ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. మండల పరిధిలోని చందోలు, కుంచలవారిపాలెం, భవనంవారిపాలెం, చోడుపాలెం, సంగుపాలెం, కోడూరు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మూలపాలెం సర్పంచ్‌పై టీడీపీ మూకల దాడి

బాపట్ల: బాపట్ల మండలం మూలపాలెం వైఎస్సార్ సీపీ సర్పంచ్ బి.అనిల్‌కుమార్‌తోపాటు కుటుంబసభ్యులపై తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం రాత్రి దాడి చేశారు. సుమారు 100 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ ఇంటిలోకి చొరబడి దాడి చేశారు. సర్పంచ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిపై వేసిన శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు మూడు రోజుల కిందట ట్రాక్టర్‌తో ఢీకొట్టి పగలగొట్టారు. దీనిపై అనిల్‌కుమార్ రూరల్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ కోపంతో సోమవారం అతనిపై దాడి చేశారు. ఈ విషయంపై రూరల్ సీఐ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేయగా కొడితే కొట్టించుకో..చంపితే చచ్చిపో అని ఫోన్ పెట్టివేశారని సర్పంచ్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడీకి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ప్రత్యేక బలగాలను పంపారు.

రేపు గుంటూరులో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఆర్ పాలిమర్స్, జెడ్ఎం క్యూర్ కోడ్ సర్వీసెస్, సిగ్నెట్ ఎలక్ట్రికల్స్, అను హాస్పిటల్స్, ఫెయిర్ డీల్ క్యాపిటల్, సెవెన్ హిల్స్ ఫార్మసీ సంస్థల్లో ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివకాలకు 98668 22697 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జీడీసీసీబీ చైర్మన్‌గా మక్కెన



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) చైర్మన్‌గా వినుకొండ నియోజకవర్గానికి చెందిన మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జునరావు 2004 నుంచి 2009 వరకు వినుకొండ ఎమ్మెల్యేగా పనిచేశారు. గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వడ్రాణం హరిబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చైర్మన్ కుర్చీపై కిరికిరి

చీరాల టీడీపీలో ముసలం

- పార్టీని నమ్ముకున్నవారికి అవమానాలు
- ఇతర పార్టీల నుంచి వచ్చిన కౌన్సిలర్లకు పెత్తనం
- చీరాల మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసం వద్దంటూ కలెక్టర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు



అవిశ్వాస తీర్మానం వద్దంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షులు, నాయకులు

చీరాల: పట్టణ టీడీపీలో ముసలం మొదలైంది. ఒక వర్గం మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం కావాలని పట్టుబడుతుండగా మరో వర్గం వద్దంటూ సోమవారం కలెక్టర్ వెంకటమురళిని కోరింది. దీంతో మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. చీరాల టీడీపీకి మున్సిపాలిటీలో ఒకే ఒక్క కౌన్సిలర్ మాత్రమే ఉన్నారు. వైఎస్సార్ సీపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు కలుపుకుని వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిన కౌన్సిలర్‌కు చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఒకే ఒక్కడు

మున్సిపాలిటీలో మొత్తం 33 మంది కౌన్సిలర్లలో ఒకరు మాత్రమే టీడీపీ నుంచి గెలిచారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఉన్నా వైఎస్సార్ సీపీకే బలం ఎక్కువగా ఉండడంతో జంజనం శ్రీనివాసరావు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్ సీపీ నుంచి కొంత మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు పలికారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను తమ వైపు తిప్పుకున్న కూటమి నేతలు ఆ దిశగా చీరాలలో కూడా చైర్మన్ పీఠంపై కన్నేశారు. కొద్ది నెలల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీకి మద్దతు పలికిన ఎస్.సత్యానందాన్ని చైర్మన్ సస్పెండ్ చేశారు. దాన్ని తీసివేయాలని ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య చైర్మన్‌కు చెప్పారు. ఆయన వినకపోవడంతో అవిశ్వాస తీర్మానం అంశాన్ని ఎమ్మెల్యే పరోక్షంగా ప్రకటించారు. అయితే, ఆ విషయం ఆ తర్వాత సద్దుమణిగింది.

తాజాగా తెరపైకి అవిశ్వాస తీర్మానం

తాజాగా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం అంశం తెరపైకి వచ్చింది. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు టీడీపీకి మద్దతు పలికిన కౌన్సిలర్లు ప్రయత్నిస్తున్నారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎమ్మెల్యే వద్ద గట్టిగా పట్టుపట్టారు. ఈ క్రమంలో టీడీపీ మద్దతు కౌన్సిలర్లుతో పాటు ఆమంచి వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొత్తం 22 మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళికి అందించారు.

మే 14న ఓటింగ్

టీడీపీకి మద్దతుగా తొలినుంచి 14 మంది ఉన్నారు. తాజాగా వైఎస్సార్ సీపీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ గోలి జగదీష్, 12వ వార్డుకు చెందిన మామిడాల రాములు, 20వ వార్డుకు చెందిన శిఖాకొల్లి రామసుబ్బులు మద్దతు తెలపడంతో టీడీపీ మద్దతుదారుల సంఖ్య 17కు చేరింది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కూడా వారివైపే ఉన్నారు. దీంతో సంఖ్యా బలం 22కు చేరుకుంది. ఎమ్మెల్యేతో పాటు ఎంపీ ఓట్లు కూడా ఉన్నాయి. వారితో కూడా కలిపి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్యా బలం 24 అయింది. అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు మే 14వ తేదీని కలెక్టర్ ఖరారు చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదుపై ఖండించిన టీడీపీ

టీడీపీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, మరికొందరు నాయకులు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం వద్దంటూ కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంపై టీడీపీ స్పందించింది.

ఈ వ్యవహారం పార్టీ ఎమ్మెల్యేకు గానీ, ఇతర నాయకులకు సంబంధం లేదని పత్రికాముఖంగా తెలిపింది. ఇది అతని వ్యక్తిగత అభిప్రాయమేనని, దుందుడుకు ఆలోచన అని, పార్టీకి సంబంధం లేదని ప్రకటించింది.

మలుపు తిరిగిన అవిశ్వాసం

వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై టీడీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మాన వ్యవహారం సోమవారం కొత్త మలుపు తిరిగింది. ఆయనపై అవిశ్వాస తీర్మానం వద్దంటూ టీడీపీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. అవిశ్వాసంపై ఓటింగ్ తేదీని జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఖరారు చేయగా, టీడీపీ నేతలు మాత్రం వద్దంటూ వినతిపత్రం ఇవ్వడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై మొదటి నుంచి ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం చూస్తే టీడీపీలో ముసలం మొదలైందని పార్టీల నాయకులు విశ్లేషిస్తున్నారు.

నీట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: జిల్లాలో మే 4న నీట్ యూజీ– 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. సోమవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నీట్ యూజీ జిల్లాస్థాయి కో– ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చీరాలలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షను నిర్వహిస్తారని, మొత్తం 416 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆయన ఆదేశించారు.

పరీక్ష పేపర్లు తెచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను హాల్ సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పోలీసు సిబ్బంది ఎంత మంది కావాలో తెలుపుతూ పోలీస్ శాఖకి లేఖ రాయాలని నీట్ యూజీ నోడల్ అధికారికి ఆయన సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని ఆయన నోడల్ అధికారికి చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విఠలేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు, నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. స్నేహలత, యార్లగడ్డ అన్నపూర్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

నగర మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర



రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పెమ్మసాని

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా టీడీపీ నుంచి కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆధ్వర్యంలో గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులు కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, డాక్టర్ బి.రామాంజనేయులు, గల్లా మాధవి, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా ఎన్నికల అధికారి సభ్యుల హాజరు సేకరించారు. సమావేశానికి 61 మంది హాజరవ్వగా, కోరం సగభాగం ఉన్నందున ప్రిసైడింగ్ అధికారి మేయర్ ఎన్నికకు సంబంధించి టీడీపీ నుంచి కోవెలమూడి రవీంద్ర, వైఎస్సార్ సీపీ నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీలో ఉన్నారని ప్రకటించారు.

రవీంద్రకు 34, వెంకటరెడ్డికి 27 ఓట్లు..

కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించగా 13 డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు బలపరిచారు. అచ్చాల వెంకటరెడ్డిని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించగా 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి బలపరిచారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోవెలమూడి రవీంద్రకు 34, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి.

శ్రీకృష్ణ లీలలు

- పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీలో లుకలుకలు
- ఎంపీ తీరుతో ఎమ్మెల్యేల అసంతృప్తి
- పైకి హుందాతనం.. లోన మోనార్కిజం
- ఎక్కడికక్కడ గ్రూపు రాజకీయాలు
- తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ నేతలు
- వైఎస్ జగన్ అందుకే పక్కన పెట్టేశారంటున్న తెలుగు తమ్ముళ్లు
- తీరు మారకపోతే పార్టీ కార్యక్రమాలకు పిలవబోమని హెచ్చరికలు



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పల్నాడు రాజకీయాల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సరికొత్త భాష్యానికి తెర తీశారు. మామూలుగా పల్నాడు రాజకీయాలంటే ప్రతీకారాలు, ప్రత్యక్ష యుద్ధాలు. కానీ శ్రీకృష్ణదేవరాయలు అడుగుపెట్టాక కొత్తకోణాన్ని పల్నాడు పరిచయం చేశారు. ఎక్కడికక్కడ గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోశారు. తాను అనుకున్నదే జరగాలనే ఒంటెత్తు పోకడలతో కేడర్ మధ్య చిచ్చు పెట్టారు. ఇలా తన రాజకీయ ప్రస్థానంలో పైకి సౌమ్యుడిలా.. లోన కుట్రపూరితంగా రాజకీయాలు చేస్తున్నారు.

వర్గపోరుకు కేరాఫ్

గతంలో వైఎస్సార్ సీపీ తరఫున నరసరావుపేట ఎంపీగా గెలిచిన లావు శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో వర్గ పోరు కొనసాగించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి రజిని, అప్పటి వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో విభేదాలు ఉండేవి. గురజాలలో కాసు మహేష్‌రెడ్డికి పక్కలో బల్లెంలా మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా గ్రూప్ రాజకీయాలను పెంచిపోషించాడన్న అపవాదు మూటకట్టుకున్నారు. మిగిలిన నియోజకవర్గ ఎమ్మెల్యేలతోనూ పైకి స్నేహపూర్వకంగా ఉన్నట్టు నటిస్తూ అంటీముట్టనట్లు వ్యవహరించే వారు. తనకంటూ అన్ని నియోజకవర్గాలలో ప్రత్యేక వర్గాన్ని పెంచి పోషించేవారు.

అందుకే జగన్ పక్కన పెట్టేశారు

వైఎస్సార్ సీపీలో చేరిన శ్రీకృష్ణదేవరాయలుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత నిచ్చారు. రాజకీయాల్లో యువకులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2019 ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీ సీటు ఇచ్చారు. అక్కడ గెలుపొందిన శ్రీకృష్ణదేవరాయలు మొదటి నుంచీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. జిల్లా వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని, ఎమ్మెల్యేలంతా తన తర్వాతే అనే ధోరణిలో వ్యవహరించే వారు. ఇది అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఈ విషయాలపై శ్రీకృష్ణదేవరాయలును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నితంగా మందలించారని కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి రజిని బహిరంగంగా చెప్పారు. తాము అధికారంలో ఉండగా శ్రీకృష్ణదేవరాయలు ఫోన్ ట్యాపింగ్ చేశారని, అక్రమాలకు పాల్పడ్డారని మీడియా ముఖంగా మాజీ మంత్రి విడదల రజిని కుండబద్దలు కొట్టారు. దీనిపై స్పందించిన ఎంపీ.. నాలుగు ముక్కలు చెప్పి వేరే విషయాలు మాట్లాడి చేతులు దులుపుకొన్నారని, దీటైన జవాబు ఇవ్వలేకపోయాడని తెలుగుదేశం పార్టీ వర్గాలే పెదవి విరిచాయి. తనను ఎంపీగా గెలిపించిన పార్టీ, ఎమ్మెల్యేలకు మోసం చేయడంతోనే వైఎస్సార్ సీపీ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కన పెట్టేశారని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆ తలనొప్పి మాకు తగులుకుందని వాపోతున్నారు.

టీడీపీలోనూ అదే పంథా

కూటమి తరఫున లావు శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేట ఎంపీగా రెండోసారి గెలిచారు. ఎన్నికల సమయంలో ఆయా ప్రాంతాల్లోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో గ్రూపు రాజకీయాలు నడిపారు. టీడీపీలోకి చేరే సమయంలోనే ఎమ్మెల్యే టికెట్ల విషయంలో కొన్ని కండీషన్లు పెట్టిమరి కండువా కప్పుకున్నారని సమాచారం. అందులో భాగంగా గురజాలలో జంగా కృష్ణమూర్తిని ప్రోత్సహించి యరపతినేనికి టికెట్ రానీయకుండా పావులు కదిపారనే ప్రచారం నడిచింది.

- నరసరావుపేటలో బీసీ అభ్యర్థి అరవింద్ బాబుకు చివర వరకు బీఫారం రాకుండా అడ్డుకున్నారు. జనసేన నేత జిలాని, కొంతమంది టీడీపీ నేతలతో జట్టు కట్టి అక్కడ కుట్రలకు తెర తీశారు. ఆ సమయంలోనే అరవింద్ బాబు, శ్రీకృష్ణదేవరాయలు మధ్య విభేదాలు పొడచూపి బహిరంగంగా తిట్టుకొనే వరకు వెళ్లాయి. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వైరం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావొస్తున్నా నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదు.
- ఇక చిలకలూరిపేటలో ప్రత్తిపాటి పుల్లారావును కాదని మర్రి రాజశేఖర్ వర్గాన్ని ఆదరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో మర్రి రాజశేఖర్‌కే పేట ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్న ప్రచారంతో పత్తిపాటి వర్గం గుర్రుగా ఉంది.
- వినుకొండలో తనతోపాటు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరిన మాజీ ఎమ్మెల్యే మక్కెనను ఎంపీ ప్రాధాన్యత ఇవ్వడంతో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వర్గం జీర్ణించుకోలేకపోతోంది. గతంలో బొల్లాకు ఇలానే తలనొప్పి తెప్పించారని గుర్తుచేసుకుంటున్నారు.
- మాచర్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి వ్యతిరేకంగా సొంతపార్టీలోనే మరో గ్రూపు కడుతున్నారు. ఈ వర్గం ద్వారా బ్రహ్మారెడ్డికి ఇక్కట్లు తీసుకొస్తున్నారు. వైఎస్సార్ సీపీలో వర్గ రాజకీయాలు చేసిన లావు శ్రీకృష్ణ దేవరాయలు టీడీపీలో చేరిన తర్వాత అదే పంథా కొనసాగిస్తున్నారు.

స్పౌజ్ పేరిట కొత్త మెలిక

- వితంతు పింఛన్ అర్థమే మార్చివేసిన కూటమి ప్రభుత్వం
- పింఛన్ పొందుతూ మృతిచెందిన భర్త స్థానంలోనే భార్యకు మంజూరు
- 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య చనిపోయిన వారి భార్యలే దరఖాస్తు చేయాలంటూ కూటమి ప్రభుత్వం మెలిక
- స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్లు మంజూరు



నెహ్రూనగర్: వితంతువులకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా చర్యలు చేపట్టింది. పింఛన్ల మంజూరును ఓ తంతుగా మార్చింది. స్పౌజ్ కేటగిరీలోనే మంజూరు చేసేందుకు ఏర్పాటు చేస్తోంది.

దరఖాస్తులు స్వీకరిస్తే ఒట్టు

కూటమి అధికారం చేపట్టిన తరువాత కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కనీసం అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించిన పాపాన పోలేదు. తాజాగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరు అంటూ అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయితే ఇక్కడా ఓ మెలిక పెట్టింది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతూ భర్త మరణించిన భార్యకు స్పౌజ్ కేటగిరీ పేరుతో మంజూరు చేయాలని నిర్ణయించింది. అది కూడా నిర్దిష్ట కాలానికి మాత్రమేనని మెమోలో స్పష్టం చేసింది. ఎవరైనా వ్యక్తి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరీ కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబర్ తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు. ఇక సాధారణంగా ఎటువంటి సామాజిక పింఛన్ పొందని వారి కుటుంబాల్లో భర్త చనిపోయినా వారికి వితంతు పింఛన్ మంజూరు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

50 ఏళ్లకే పింఛన్ అమలు హుళక్కే!

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 2,52,715 మందికి పింఛన్లు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో సుమారు 7వేల దాకా పింఛన్లు ఆగిపోయాయి. ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారని, వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికీ 50 ఏళ్లు నిండిన వారు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

గత ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసింది. 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని పథకాలకు దరఖాస్తు చేయించేవాళ్లు. 35 ఏళ్ల వయస్సు పైబడిన మహిళలకు భర్త చనిపోతే ఆ మరుసటి నెలలోనే వితంతు పింఛన్ అందించే వారు.

కూటమి ప్రభుత్వంలో ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు కాలేదు. పది నెలలుగా దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా స్పౌజ్ కేటగిరీ పేరుతో నిబంధనలు విధించడంతో అర్హత కలిగిన వితంతువులు పింఛన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు వారం వారం అర్హులు ప్రభుత్వ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఎదురుచూపులు తప్పేలా లేవు

ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారు. వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి.

– విజయలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

అక్రమ లే అవుట్లపై కొరడా

తోటవారిపాలెంలో లేఅవుట్ నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్



చీరాల టౌన్: అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులు పడవద్దని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. సోమవారం 'సాక్షి'లో వచ్చిన 'బరితెగించిన భూచోళ్లు' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని తోటవారిపాలెంలో అనధికారికంగా వేసిన లే అవుట్‌ను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. లేఅవుట్‌కు సంబంధించిన భూమి రికార్డులను తనిఖీ చేశారు. అనధికారికంగా, అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. తోటవారిపాలెం సచివాలయం సమీపంలో పంట పొలంలో వేసిన వెంచర్‌కు అనుమతులు లేవని, వీటిలో అమ్మకాలు చేయవద్దని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చీరాల మండలంలోని రూరల్ గ్రామాల్లో అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు కూడా అన్నీ అనుమతులు ఉంటేనే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అనుమతులు లేని ప్లాట్లు కొని ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా వేసిన, వేస్తున్న లేఅవుట్లను క్షుణ్ణంగా పరిశీలనలు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి

ఏఎస్పీ విఠలేశ్వర్



బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురి నుంచి ఆయన అర్జీలను స్వయంగా స్వీకరించారు. వారితో ముఖాముఖీ మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 44 అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో మంచి ఫలితాలు సాధించాలి

సర్వశిక్ష అభియాన్ జీసీడీవో చారులత

బల్లికురవ: పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల కోసం మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి మార్కులతో పాటు పర్సంటేజ్ మార్కులు పెంచుకోవాలని సర్వశిక్ష అభియాన్ జీసీడీవో చారులత కోరారు. ఆమె సోమవారం బల్లికురవ, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల శిక్షణ తరగతులను, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. 20 రోజుల పాటు కష్టం పడటంతోపాటు ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యామని బాధపడొద్దని, ఆత్మస్థైర్యంతో చదవాలని సూచించారు. ఆమె వెంట ఎస్ఎస్ఏ ఏఈ షేక్ రాజన్‌బాబు, ఎస్‌వోలు ఉన్నారు.

ప్రజా సమస్యలపై అశ్రద్ధ వద్దు

- పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వారి సంతృప్తి మేరకు పరిష్కరించాలని ఆయన అధికారులకు చెప్పారు. జిల్లాలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పీ–4 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పెన్షన్లు, గృహాలు, ఇంటి పట్టాలు, బ్యాంకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళలకు 12,500 పాడి గేదెల పెంపకం యూనిట్లు మంజూరు లక్ష్యం ఉందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అమలు చేసే కార్యక్రమంలో ప్రతి మండలంలో 500 మందిని గుర్తించి బ్యాంకు రుణాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజె దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామిరెడ్డి పాల్గొన్నారు.

హిజ్రాలకు సర్టిఫికెట్లు ఇప్పించాలి

బాపట్ల జిల్లాలో హిజ్రాలకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఎక్కడ తీసుకోవాలో కూడా అర్థం కావడం లేదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు రూ.4వేలు కూడా తీసుకోలేని పరిస్థితి ఉంది. జోక్యం చేసుకుని సర్టిఫికెట్లు ఇప్పించాలి.

–రమ్య

పొలం పాస్ పుస్తకాలు వేరొకరికి ఇచ్చారు



అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలోని సర్వే నంబరు 11లోని నా పొలానికి సంబంధించి 20సెంట్లను వెంకటలక్ష్మి అనే మహిళ ఖాతాలోకి ఎక్కించి పాస్ పుస్తకాలు ఇచ్చారు. ఈ విషయంపై జేసీ కోర్టులో తనకు న్యాయం చేయాలని చెప్పినప్పటికీ అద్దంకి రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. –విజయభాస్కర్‌రెడ్డి, అద్దంకి

పోలీసులే హెచ్చరిస్తున్నారు



అద్దంకి మండలం ధర్మవరంలో నా పెట్రోలు బంకును మూసివేయాలని పోలీసులే చెబుతున్నారు. ఒక వ్యక్తి వచ్చి బంకు వద్ద గొడవ పెట్టుకుంటే రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించాను. బంకు నడుపేందుకు అవకాశం లేదు, మూసివేయాలని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. –కోటిరెడ్డి, ధర్మవరం

ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



వేసవి సందర్భంగా ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అర్జీలు ఇచ్చేవారికి మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద మజ్జిగ పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బత్తుల సురేష్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ



ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు బి.ఎస్.నారాయణభట్టు ఆధ్వర్యంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉండటంతో రెడ్‌క్రాస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పొంగళ్లు, నైవేద్యాల సమర్పణ



ఉత్సవానికి హాజరైన గ్రామ ఆడపడుచులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: స్థానిక గ్రామ దేవత గంగాభవానీకి సోమవారం మహిళలు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 38వ తిరునాళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారి శిడి మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి గ్రామ ఆడపడుచులు పెద్దఎత్తున అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు, ఆడపడుచులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు ఆవుల రాజేష్ పూజలు నిర్వహించారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన టిప్పర్

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- బస్సులో 50 మంది ప్రయాణికులు
- ముగ్గురికి గాయాలు



ఘటన స్థలంలో బస్సు, టిప్పర్



గాయపడిన ప్రయాణికులు

అద్దంకి: ట్రావెల్ బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని చిన్నకొత్తపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. శ్రీకృష్ణా ట్రావెల్స్‌కు చెందిన బస్సు 50 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్తోంది. ఈ క్రమంలో టిప్పర్ అద్దంకి నుంచి పెదకొత్తపల్లి వైపు వెళ్లడం కోసం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటోంది. సరిగా బస్సు మండలంలోని చినకొత్తపల్లి వద్దకు రాగానే టిప్పర్ ఢీ కొట్టింది. దాంతో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఒక్కసారిగా బస్సులో పెద్ద కుదుపు రావడంతో ప్రయాణికులు గాయపడ్డారు. వెంటనే దిగుదామని ప్రయత్నించిన వారికి డోర్‌లు లాక్ అయి ఉండటంతో ఏం చేయాలో తోచలేదు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని డోర్ లాక్‌లను ఓపెన్ చేయడంతో ప్రయాణికులు బయటకు వచ్చారు. ప్రమాదంలో మద్దిపాడుకు చెందిన ఏ.శామ్యూల్, చీమకుర్తికి చెందిన జి. అనూష, కొండపికి చెందిన జి. శైలజలకు గాయాలయ్యాయి. వీరితో మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వారిని 108 వాహనంలో ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. టిప్పర్ యూటర్న్ తీసుకుంటూ బస్సును ఢీ కొట్టడంతో తిరగబడింది. అదే బస్సు తిరబడి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని అధికారులు చెప్పారు.

పోరాటంతోనే రైతుల సమస్యలకు పరిష్కారం

- రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య
- ఇంకొల్లులో ముగిసిన పొగాకు రైతుల సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఇంకొల్లు(చినగంజాం): రైతులందరూ సంఘటితమై పోరాటం చేస్తేనే నల్ల బర్లీ పొగాకు కొనుగోలు సమస్య పరిష్కారం అవుతుందని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య అన్నారు. ఇంకొల్లు గరల్స్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం పర్చూరు నియోజకవర్గ స్థాయిలో పొగాకు రైతులు సదస్సు నిర్వహించారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కృష్ణయ్య మాట్లాడుతూ గత రెండు నెలలుగా పొగాకు కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు కలెక్టర్‌ను కలసినా ఫలితం లేదని తెలిపారు. రాస్తారోకోలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. గత నెలలో కలెక్టర్ ఆధ్వర్యంలో పొగాకు కంపెనీ వారితో సమావేశం నిర్వహించి, వెంటనే కొనుగోలు చేయాలని చెప్పినప్పటికీ అది ఆచరణలో సాధ్యం కాలేదని పేర్కొన్నారు. గత ఏడాది రూ.15 వేలకు క్వింటా కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకు ప్రస్తుతం అక్కడక్కడా కంటి తుడుపు చర్యగా కంపెనీలు రూ. 3 వేలు, రూ. 4 వేలకు దళారుల ద్వారా గ్రామాలలో కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి డి. రమాదేవి విమర్శించారు. బహుళజాతి కంపెనీలు పొగాకు రైతులను దగా చేస్తున్నాయని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు ఆరోపించారు. కొట్టుడు కూలీ కూడా ఇవ్వలేని స్థితిలో కౌలు రైతులు ఉన్నారని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సీహెచ్. గంగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామారావు పాల్గొన్నారు.

సుభాషిణి సేవలు ప్రశంసనీయం



అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుభాషిణిని సన్మానిస్తున్న జిల్లాకలెక్టర్,అధికారులు

బాపట్ల: సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుభాషిణి సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల ఉద్యోగ విరమణలు సామాన్యమని అయినప్పటికీ ఉద్యోగ విరమణ చేయడం కొంత బాధగా ఉంటుందని అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి కొల్లూరు వరద సమయంలో మహిళా అధికారి అయినప్పటికీ చాలా కష్టపడి పని చేశారని కొనియాడారు. సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి శేష జీవితం సంతోషంగా ఆనందం గా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వ్యాధులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ, జిల్లా మలేరియా అధికారి డాక్టరు గోపీనాథ్, మలేరియా కార్యాలయం సబ్ యూనిట్ అధికారులు ఖదీర్, షకీల్, హెల్త్ సూపర్‌వైజర్ రాంబాబు, మలేరియా కార్యాలయ ల్యాబ్ టెక్నీషియన్ కూరపాటి సత్యంరాజు పాల్గొన్నారు.

అరెస్టులు చేయడం సరికాదు



బాపట్ల: బీసీల సమస్యల పరిష్కారంపై పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల విశ్వశాంతి ఉన్నత పాఠశాల సమీపంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణన, రక్షణ చట్టం, రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ విజయవాడలో ఆదివారం జరిగిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం సరికాదని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరుల నాయకులను అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదే పోకడ పోతే భవిష్యత్తులో తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అందజేయడానికి ప్రణాళిక రూపొందించమని తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయిలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహిస్తామని వెల్లడించారు. బీసీ గర్జన కూడా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గోపి మృతదేహం

చీరాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున చీరాల సమీపంలోని ఫ్రెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు వివరాల మేరకు.. కారంచేడుకు చెందిన స్వర్ణ గోపి (25) ద్విచక్ర వాహనంపై చీరాల వస్తున్నాడు. చీరాల సమీపంలోని ఫ్రెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలోకి రాగానే రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపు తప్పడంతో మృతి చెందాడా ? ఏదైనా వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా ? అనేది దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు.

చైల్డ్ వెల్ఫేర్ సంరక్షణలో గుర్తు తెలియని బాలుడు



యద్దనపూడి: మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాల మధ్య రోడ్డుపై ఓ బాలుడు గతేడాది డిసెంబర్ 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఏడుస్తూ నడిచి వెళ్తుండగా స్థానికులు గమనించి, వివరాలు అడిగారు. ఏమి చెప్పలేక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాలుడి వివరాల కోసం పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంరక్షణ నిమిత్తం ఒంగోలులోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. ఈ క్రమంలో యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాలుడి వివరాలు తెలిసినవారు తన నంబర్‌తో పాటు 91211 02153, పర్చూరు సీడీపీఓ 94910 51623, జి.కోటేశ్వరమ్మ 72079 86210ను సంప్రదించాలని ఆమె కోరారు.

మడ అడవుల జీవావరణ వ్యవస్థ మైలురాయి

జిల్లా డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఎల్. భీమయ్య



చినగంజాం: ఏటిమొగ మడ అడవుల జీవావరణ వ్యవస్థ రాష్ట్రంలో స్థిరమైన పర్యావరణ పర్యాటకం, సంరక్షణ ప్రయత్నాలలో ముఖ్యమైన మైలురాయి అని జిల్లా డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఎల్. భీమయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ ఆధారిత మడ అడవుల జీవావరణ వ్యవస్థ మార్గాన్ని సోమవారం చినగంజాం మండలం ఏటిమొగలోని తీర ప్రాంతంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎఫ్ఓ ఎల్. భీమయ్య హాజరై మాట్లాడారు. స్థానిక ప్రజలు పర్యావరణ సంపదను పరిరక్షించడంలో, ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. ప్రాజెక్ట్ మే 11 నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రకృతి సహజ నడక మార్గాలు, పక్షుల వీక్షణ, స్థానిక సాంస్కృతిక సంభాషణలు, ఏటిమొగ మడ నదీ ముఖద్వారం, గొప్ప జీవ వైవిధ్యం మధ్య బోట్ ట్రైల్స్ ద్వారా విశిష్టమైన అనుభూతులను అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ పీఏ జేవీ రమణ, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. చంద్రారెడ్డి, నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ నరేష్, సాయిమహేష్, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.

మహా నటుల పుట్టుకకు నాటకాలే మూలాలు



పారితోషికం, దుస్తులు అందజేస్తున్న దర్శక, నిర్మాత రావులపల్లి రాంబాబు

భట్టిప్రోలు (కొల్లూరు): మహానటుల పుట్టుకకు నాటక రంగమే మూలమని సినీ దర్శక, నిర్మాత రావులపల్లి రాంబాబు అన్నారు. మండలంలోని పల్లె కోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయస్థాయి ఆహ్వాన నాటక, నాటిక పోటీలు రెండవ రోజైన సోమవారం దిగ్విజయంగా నిర్వహించారు. నాటక, నాటిక పోటీల అనంతరం కళాకారులకు నిర్వాహకులు పారితోషికం, దుస్తులు అందజేత కార్యక్రమంలో రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాటక రంగం లేకపోతే సినీ రంగం ఇంత స్థాయిలోకి వచ్చేది కాదన్న విషయం జగమెరిగిన సత్యమన్నారు. నాటక రంగానికి కాలానుగుణంగా ప్రాధాన్యత తగ్గిపోతున్న తరుణంలో ఆ రంగానికి పూర్వ అనుభవం తీసుకురావాలన్న లక్ష్యంతో పరుచూరి రఘుబాబు స్మారక జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండో రోజు విశాఖపట్నానికి చెందిన చైతన్య కళాస్రవంతి వారు మంత్రనగరి నాటకంతో పాటు, సౌజన్య కళా స్రవంతి విజయనగరం వారి దేవరాగం నాటిక, గుడివాడకు చెందిన కృష్ణా ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటికలు ప్రదర్శించారు. నాటక, నాటికల ప్రదర్శనకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కళా అభిమానులు తరలిరావడంతో ప్రదర్శనా ప్రాంగణంలో సందడి వాతావరణం నడుమ నాటకాలు, నాటికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు ప్రదర్శించిన నాటకాలు, నాటికలకు మార్కులను కేటాయించారు. ప్రదర్శనలు నిర్వహించిన నాటకానికి రూ.35 వేలు, నాటికలకు రూ. 25 వేలు చొప్పున నిర్వాహకులు పారితోషికాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సినీ కథా రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, సినీ నటి శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అనర్థాలకు కోరికలే కారణం

ఆకట్టుకున్న అలరించిన కళాంజలి నాటికలు



నిశి నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: మనసులో కోరికలు మనిషిని అక్రమ మార్గంలోకి నెట్టి బతుకును చీకటిమయం చేస్తాయనే సందేశంతో ప్రదర్శించిన 'నిశి' నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. చీరాలలో కళాంజలి జాతీయ నాటకోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన నిశి నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన, దర్శకత్వం పోలుదాసు శ్రీనివాసరావు వ్యవహరించారు. నాటికలోని ప్రదీప్, లక్ష్మీ, ఆకాష్, రవి పాత్రలను పాత్రదారులు నటనలో రక్తికట్టించారు. అలానే విజయవాడ మైత్రి కళానిలయం వారు ప్రదర్శించిన 'బ్రహ్మస్వరూపం' నాటిక అందరిని ఆకట్టుకుంది. నాటికకు రచన శ్రీస్నిగ్ధ, దర్శకత్వం టీవీ పురుషోత్తం వ్యవహరించారు. ఈనెల 30వ తేదీ వరకు నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.